# జగన్నాటకం

ఇంకా నాటకం ప్రారంభం కాలేదు. సభాస్థలం ప్రేక్షకులతో కిటకిటలాడిపోతోంది. రంగస్థలం దగ్గర నుంచీ జనమే! లోపల ఏమాత్రమూ తావు లేకపోవడం చేత కొందరు ద్వారాల కడ్డంగా నిల్చున్నారు. మరి కొందరు కమ్మీలు లేని కిటికీల్లో కూర్చున్నారు.

నాటక కళను వృత్తిగా స్వీకరించి దేశంపైన పరిభ్రమిస్తున్న ట్రూపు. నేడు ప్రదర్శించబోతున్నది సాంఘిక నాటకం. పేరు 'త్యాగం.' మానవత్వాన్ని మరో మెట్టు పైకి తీసుకుపోగల శక్తి త్యాగానికి వుంది గనుక త్యాగం చాలా గొప్పదే! కానీ ఈ నాటకానికి పట్టణంలో జరిగిన ప్రచారం అంతకన్నా గొప్పది. ఆ ప్రచారానికి ఫలితమే ఈ జనస్తోమం!

హాలుకు మధ్యగా వున్న ఓ పిట్టగోడ ప్రేక్షక సమూహాన్ని యిరుతెగలుగా విభజిస్తోంది. ఓవైపు పురుషులు, మరోవైపు స్త్రీలు. పురుషుల వైపున పొగ మబ్బులు, స్త్రీల వైపున పుష్ప సౌరభం - ఇదీ చెప్పుకోదగిన విభేదం. గలాటా యిక్కడా అక్కడా సమంగానే వుంది. లేదంటే అక్కడ 'విజిల్స్' తెగ మ్రోగుతున్నాయి. ఇక్కడ పసివాళ్లు గొంతు చించుకుంటున్నారు.

స్త్రీల వైపున, ఓ మారుమూల-గోడకు చేరువగా వున్న కుర్చీలో ఓ ముప్పై యేళ్ళ బక్కపలుచటి యువతి కూర్చుంది. బాగా పీల్చుకుపోయిన ముఖం. కళ్ళు మరీ లోతులో వున్నట్టున్నాయి. సులోచనాల మూలంగా వాటిని యింతకంటే పరిశీలించే అవకాశం తక్కువ. చేరువలో ఆమెకు పరిచితులెవరూ వున్నట్లు తోచదు. పేరుబెట్టి సంబోధించేవాళ్ళు లేరు గనుక ఆమె పేరు యితరులకు తెలిసే అవకాశం గూడా మృగ్యమే! కానీ పేరు తెలియని మనిషిని గురించి కథ వ్రాయడం దుస్తరం. కథ కోసమైనా ఓ పేరు అవసరం! పబ్బం గడుపుకోడానికి ఏ పేరైతేనేమి అనుకోగలిగినట్టయితే ఈ కథకు సంబంధించినంతవరకూ ఆవిడ పేరు సులోచన!

లోచనాలు మంచివని కాదుగానీ, ఎలాగూ ఆమె కళ్లజోడు వేసుకుంది గనుక, ఆ కళ్లజోడుతోనే ఈ కథ ప్రారంభం కూడా అవుతున్నది గనుక ఆమెను సులోచన అని వ్యవహరించడం సమంజసం కాకపోదు.

సులోచనకు ఎడమవైపు కుర్చీలో ఓ ముసలావిడ కూర్చుంది. ఆవిడ వయస్సు అరవైకి దరిదాపుల్లో వుండవచ్చు. పాపట ప్రక్కన శిరోజాలు కొన్ని వెండి తీగల్లా మెరిసిపోతుండడం తప్పితే, ఆమెలో వృద్ధాప్యపు లక్షణాలంత పొడగట్టవు. సహజంగా కాస్త కలుపుగోలు మనిషేమో, ఆవిడ కాస్త తటపటాయించిన తర్వాత సులోచనను సంభాషణకు రాదీసింది.

"ఎంతకాలం నుంచీ వేస్తున్నావమ్మాయ్ కళ్లజోడు?"

"పదేళ్ళ నుంచీ వేసుకుంటున్నానండీ!" అంది కాస్త సిగ్గుపడుతూ సులోచన.

"ఏమిటో మరి, కాలమే విడ్డూరంగా మారిపోయిందిలే అమ్మాయ్! నా మనవరాలొకతె వుంది. పట్టుమని పదిహేనేళ్లుండవు దానికి! ఓరోజన్నట్టుండి 'అక్షరాలు అలుక్కుపోయినట్టున్నాయి నాన్నా' అన్నదిట. వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళడం, పరీక్ష చేయించడం, జోడు తగిలించడం! పెళ్ళి కావలసిన పిల్లకు యిదేం వికారంరా బాబూ అంటే వినిపించుకునే నాధుడెవరు?"

"కానీ నా విషయం వేరండీ పిన్నిగారూ!" ఆత్మీయతను ఒకలబోయకపోతే కొందరు మనుషులు ఎదుటి వాళ్ళను నమ్మలేరన్న మనస్తత్వరహస్యం తనకు బాగా తెలుసునేమో - వరస కూడా కలుపుకుంది సులోచన. "మొదటి నుంచీ ఈ కళ్ళు అధ్వాన్నంగానే వున్నాయి. చిన్నప్పుడు ఎండను చూడలేకపోయేదాన్ని. అందరూ నీడకళ్ళ అమ్మాయినని పేరుబెట్టారు. పదహారో ఏడు వచ్చేదాకా వంటగదిలో మగ్గిపోయాను. పొగంతా నా కళ్ళపాలే అయింది. ఏకధారగా కారిపోతుండేవి కన్నీళ్ళు! ఆ తరువాత ఈ వూరొచ్చాను. ఇక్కడ ఎలక్ట్రిక్ దీపాల వెలుగులో చూపు మరీ చెడిపోయింది. పైగా రెక్కాడితే గానీ డొక్కాడని బ్రతుకైపోయె! గత్యంతరం లేక కళ్ళజోడు సహాయం ఆపేక్షింపవలసి వచ్చింది. సూదికి నూలెక్కించాలంటే కంటి చూపు తిన్నగా వుండాలి కదండీ మరి!"

"ఐతే నువ్వు దర్జీపని చేస్తున్నావా అమ్మాయ్?" విస్తుపోతూ ప్రశ్నించింది ముసలావిడ.

"తప్పేముందండీ? దొంగతనం చేస్తే తప్పు. దగా చేస్తే తప్పు. రెక్కల కష్టంతో జీవించడం తప్పు కాదు గదండీ!"

ముసలావిడ ఆలోచనలో పడిపోయింది. పెద్ద కుటుంబాల్లోని పెద్ద వాళ్లకు పెద్దలనుంచీ వచ్చిన సాంప్రదాయాన్ని పరిరక్షించడం తప్పితే మరొక పెద్ద పని వుండదు. వంట చేయడం, బిడ్డలను లాలించడం, ఇంటిని పరిశుభ్రంగా వుంచుకోవడం - యిలాంటి పనులెన్నో వుండగా ఒక ఆడమనిషి స్వతంత్రించి ఓ వృత్తిని స్వీకరించడం ముసలావిడకు గిట్టకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. అందుచేతనే గావచ్చు. ఆమె సులోచన పైకి బరపిన చూపుల్లో అనుమానం నాలుకలు సాచింది.

ఐతే తనను తాను సమర్థించుకోదలచలేదు సులోచన. ఎవరో ఒక అపరిచిత వ్యక్తి తనను గురించి ఏమిటో అనుకుంటే తనకు నష్టమయ్యేదేమీ లేదు. కాలాన్ని వేగించడానికి వీలైనంత నిర్లిప్తతను అభినయించ గలిగితే చాలు. గండం గడిచి గట్టెక్కినట్టే! అంతటితో నాటకం ప్రారంభమై పోతుంది.

సులోచన యిలా భావించిన మాట నిజమే! కానీ కొందరు మనుషులకు వూరుకోడం కానీ, వూరుకోనివ్వడం కానీ చేతకాదన్న విషయం కొంతసేపట్లోనే ఆమెకు తెలిసిపోయింది.

ముసలావిడ సావధానంగా కథను ఆకళించుకోబోతున్న శ్రోతలా ఆసక్తిని వ్యక్తపరుస్తూ "ఐతే మీ పుట్టిల్లు ఏ వూరన్నావమ్మాయ్?" అని ప్రశ్నించింది.

ఇప్పుడు సులోచన ఏదో ఒక నిర్ణయానికి రావలసి వచ్చింది. కథకి శ్రీకారం చుట్టడమంటూ జరిగితే సంగ్రహంగా నయినా ముగించక తప్పదు. నేపథ్యంలో కలకలం వినిపిస్తోందే తప్ప ఆ అవనిక ఒక పట్టాన పైకి లేవదు!

తనిప్పుడేం చేయాలి? .

ఆఖరుకు చెప్పుకోక తప్పిందిగాదు సులోచనకు.

"కదిరిమల్లెపువ్వుల్ని గురించి విన్నారటండీ పిన్నిగారూ! బలే సువాసన వాటికి!" ప్రారంభించింది సులోచన, "ఒకటి మల్లెపువ్వులు, రెండోది నరసింహ స్వామి దేవాలయం. వచ్చిన ప్రఖ్యాతి కదిరికి వీటివల్ల వచ్చింది. ఆ పట్టణానికి నాలుగు మైళ్ళలో వుంది మా వూరు.. పేరు చిలకల దిన్నె..."

"తల్లితండ్రులున్నారు గదూ?"

"ఎనిమిదో ఏడు జరుగుతూండగా తల్లి పోయింది. నాన్నగారు పునర్వివాహం చేసుకున్నారు. పిన్ని కాపురానికి వచ్చింది. మారుతల్లి సవతి బిడ్డల్ని నిరాదరణ చేయడమనేది లోకంలో సర్వ సాధారణమైన విషయమే గదండీ పిన్నిగారూ! ఐతే నా విషయంలో దాన్ని కేవలం నిరాదరణ అని చెప్పడానికి వీల్లేదు. ద్వేషమని కూడా చెప్పుకోవచ్చు. నాన్నగారికి ఇంటికి బయట ఏదో ఎడతెగని పనులు. ఇంట్లో చాకిరీ చేస్తున్నదెవరో, తిని తీరి కూర్చుని అధికారాలు చెలాయిస్తున్నదెవరో తెలుసుకునేపాటి ఓపిక ఆయనకుండేది కాదు. కళ్ళ జబ్బుతో పాటూ నాకప్పుడప్పుడూ భరించరాని తలనొప్పి కూడ వచ్చేది. రోగాలు గనుక అదృష్టవంతులకు వస్తే, వాటికి డాక్టర్లు, మందులు, ఇంజక్షన్లు – ఒకటేమిటి, సర్వోపచారాలూ జరిగిపోతాయి. నాలాటి దిక్కుమాలిన వాళ్ళకు వచ్చి జబ్బులు బావుకోబోయేదేముంటుంది? ఈ తలనొప్పి ఎందుకొచ్చినట్టా అని వితర్కించుకునే దాన్ని. ఆలోచించగా, ఆలోచించగా కారణం తెలిసి వచ్చేది..."

"ఏమిటమ్మా అది? ఆ పూటకు కాఫీ మిగిలి వుండేది కాదేమో కదూ?"

"కాఫీ గాదండీ పిన్నిగారూ! నేనప్పటికి తలంటు పోసుకుని రెండు మూడు మాసాలు గడిచిపోయి వుండేవి!"

ముసలావిడ నిట్టూర్చింది. అప్రయత్నంగా ఆవిడ పెదవులపైన 'అయ్యో పాపం!' అన్న మాటలు వీణా తంత్రులపైన వ్రేళ్ళ కదలికలా వినిపించాయి.

"ఈడేరిన తరువాత కూడా నేనా యింట్లో రెండు మూడేళ్ళు వుండిపోయాను. ఆ తరువాత కూడా నన్ను యింట్లో వుంచుకోడానికి యిష్టం లేక కాదుగానీ యిరుగుపొరుగు వాళ్ళ ఒత్తిడి ఎక్కువయింది. పెళ్ళి చేసి నన్నొక అయ్య చేతికి పట్టివ్వకపోతే యిక వీధిలో తలెత్తుక తిరగడం సాధ్యం కాదనిపించిన పరిస్థితిలో నాకు పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జాబు మూలంగా పెళ్ళి చూపులకు అబ్బాయి వస్తున్నట్టు తెలిసింది. దగ్గరి బంధువు లెవరూ లేరని అతడు ఓ స్నేహితుణ్ణి మాత్రం వెంట పెట్టుకుని వచ్చాడు. నన్ను చూపించడం, పాట పాడించడం మొదలైన తతంగమంతా సజావుగా జరిగిపోయింది..."

"అబ్బాయి నీకు నచ్చాడో లేదో చెప్పావు కాదు..."

"నచ్చకపోవడానికి నాకేమంత పెద్ద కోరికలున్నాయండీ పిన్నిగారూ! నా ముఖానికి, అలాటి సంబంధం దొరికితే అదే పదివేలనుకున్నాను. అతడు వదులొదులుగా పైజామా వేసుకున్నాడు. గళ్ళ బనీనుపై ఉల్లిపొర లాంటి జుబ్బా తొడుక్కున్నాడు. చెరువులో అలల్లాగా గిరజాలున్నాయి. సిగరెట్టు కాలుస్తూ నా ఎదుట కూర్చున్నాడు..."

"ఇంకేం... నీకు నచ్చాడన్నమాటే..."

నచ్చినట్టేనని చెప్పబోతున్నది సులోచన. తెరవెనుక కలకలం హెచ్చింది. గంట మ్రోగింది. వెంటనే ప్రార్తనా గీతమూ ప్రారంభమయింది.

"పరాబ్రహ్మ పరమేశ్వర
పతితపావన సుప్రకాశ
వరదాయక సర్వలోక
వాంఛిత ఫలదాప్రమేయ..."

ప్రార్థన పూర్తి కాగానే రంగంపైన దీపాలు ఆరిపోయాయి. తెరమెల్లగా పైకి లేచింది. మొదట

ఒక దీపం వెలిగింది. ఆ తరువాత వేరొక్కటి. క్రమక్రమంగా అన్నీ వెలిగాయి. అడ్డంగా దిగజారిన పొరలు ఒక్కొక్కటిగా విడిపోయినట్టుగా ప్రేక్షకుల కళ్ళకు రంగస్థలమంతా స్పష్టంగా ద్యోతకమైంది.

ఓ యువకుడు కుంచెను చేబట్టి చిత్రరచన కొనసాగిస్తున్నాడు. ఆ గదిలాగే అతడి వేషం కూడా చిందర వందరగా వుంది. మాటిమాటికీ కళ్లపైకి వ్రాలుతున్న క్రాపింగును ఎడమచేత్తో సవరించుకుంటూ అతడు గాఢదీక్షతో చిత్రంలోని సుందరాంగి నయనాంచలాలకు మెరుగులు దిద్దుతున్నాడు.

ఇక్కడ చిత్రకారుని చిత్రానికి మోడల్‌గా కూర్చున్న యువతిని గురించి ఓ మాట చెప్పాలి. ఆమెను గురించి ఆ ఒక్క మాటను మాత్రం చెబుతే చాలు. ఆమె లేజవ్వని! కాదంటే ఆహార్యాన్ని గురించి ఒకటి రెండు మాటలు : ఆమె తెల్లటి షిఫాన్ చీర కట్టుకుంది. సరిగ పోగులు అడ్డదిడ్డంగా పరుగెడుతున్న పచ్చటి చోళీ వేసుకుంది. నుదుట దీపశిఖలాంటి బొట్టు...

ప్రేక్షకులు చూచినంతవరకూ ఆమె రెండు మూడు నిమిషాలు మాత్రమే అలా నిశ్చలంగా కూర్చోగలిగింది. ఆ తరువాత అందాన్ని చీల్చుకుని బయటపడిన పులుగునిసుగులా ఒళ్ళు విరుచుకుంటూ పైకి లేచేసింది.

"నేను కూచోలేను ప్రసాద్! గంటల తరబడీ రాతి బొమ్మలా కూచోడం నా చేతనయ్యే పనికాదు ప్రసాద్!" అంటూ ప్రసాదరావుతో తన ఎత్తును పోల్చుకోబోతున్న దానికి మల్లే ఆమె అతడి ప్రక్కన నిల్చుంది.

"డియర్ లతా! దయచేసి కూచోవూ!" అర్థించాడు ప్రసాదరావు.

ఈ సందర్భంలో నాటకరచయితకు ప్రబంధాలూ, వాటిలోని కవి సమయాలూ జ్ఞప్తికి వచ్చినట్టున్నాయి!

"ఎలా కూచోగలను ప్రసాద్! ఆషాఢ మేఘాన్ని చూసి మయూరి నాట్యం చేయకుండా వుండగలుగుతుందా చెప్పు. షోడశ కళా విభాజితమైన చంద్రబింబాన్ని చూచినప్పుడు కలువ కన్నె అరుణాధరాలపైన ఓ దరహాసం విరిసిపోకుండా వుండగలుగుతుందా చెప్పు! తూరుపు కొండపైన గగనానికి తరుణార్కుని తొలి వన్నెలు చిన్నెలు దిద్దగానే తమ్మిమొయిలనాగ తరంగ రంగ స్థలంపైన ఆనంద లాస్యం సలుపకుండా వుంటుందా చెప్పు, మైడియర్ ప్రసాద్..."

ప్రసాద్ చుబుకాన్ని స్పృశిస్తూ అంది లత - "నువ్వు నా చిత్రం గీయకుంటే మానే, నేను నీ సాన్నిధ్యంలో బొమ్మలాగా కూర్చోలేనయ్యా!"

చిత్రకారుడి చేతిలోని కుంచె జారి క్రింద పడిపోయింది.

సినిమాలోనైతే అప్పుడు కెమెరా తపోనియమానికి తిలోదకాలిచ్చి మేనకను చూస్తూ పైకి లేస్తున్న విశ్వామిత్రుడి చిత్రం పైకి మళ్ళి ఉండేది!

"సంధ్యా సమయం ఎంత మనోహరంగా వుంది ప్రసాద్! నాలుగు గోడల మధ్య యిలా కూచోకపోతే ఒకసారి అలా హాయిగా షికారెళ్ళొస్తే బాగుండదూ?"

ఓ క్షణం ఆలోచించి అన్నాడు ప్రసాదరావు : "బాగానే వుంటుంది లతా! కానీ చూచిన వాళ్లేమనుకుంటారు?"

"ఎవరో ఏమిటో అనుకుంటారని మనం మన ఆనందాన్ని పాడు చేసుకుంటామా ప్రసాద్! అలా ఆత్మవంచన చేసుకోడం కన్నా బ్రతక్కపోవడమే మేలుగాదూ?"

"నిజమేననుకో లతా! కానీ మీ నాన్నగారు? ఆయన ఒకవేళ మనల్ని గురించి మరొక విధంగా

భావిస్తే..."

"ఊహూ... అదేం జరగదు" తలనడ్డంగా వూపుతూ అంది లత. "ఆయన అభిప్రాయపడడమంటూ జరిగితే మనం పరస్పరం ప్రేమించుకున్నామనుకుంటారు. మనది పవిత్ర ప్రేమనుకుంటారు..."

ఆయన అలా అనుకోగలిగితే మరేమీ అభ్యంతరం లేదులా వుంది ప్రసాదరావుకు! అతడు 'ఓ నిముషంలో వస్తాను' అంటూ గదిలోపలకు వెళ్ళాడు.

ప్రసాదరావు తిరిగి వచ్చేసరికి లత తన ప్రతికృతిని చూస్తూ ఓ పాటను ముదలంకించుకోడం వల్లనూ, పాటలో ఆమె వెలిబుచ్చిన సందేహాలకు బదులు చెప్పి ప్రసాదరావు కూడా తన 'పాటకారితనాన్ని' నిరూపించుకోవలసి వచ్చినందువల్లనూ ప్రేయసీ ప్రియులు షికారుకు బయల్దేరడంలో కాస్త ఆలస్యం జరిగి, అందుమూలంగా తెర క్రిందికి వాలడంలోనూ విలంబనం తప్పనిసరైంది.

"ఐతే మేమింత బాహాటంగా ప్రేమించుకోలేదండీ పిన్నిగారూ!"

ముసలావిడ వులికిపడింది. "ఔనుగదూ! మా కాలంలో మేమూ ఎరగమమ్మా మరి! నేనైతే పెళ్ళయిన తర్వాత మూడేళ్ళదాకా ఒంటరిగా వున్నప్పుడు తప్పితే మావారితో ముఖమెత్తి కూడా మాట్లాడేదాన్ని కాను. సిగ్గూ, సంకోచమూ ఆడదానికి ఆభరణాలు గదమ్మా తల్లీ!"

"కాని ఆ సిగ్గూ, సంకోచాల వల్ల ఒక్కొక్కప్పుడు ఎలాంటి విషమ పరిణామాలు ఏర్పడుతాయనుకుంటున్నారు పిన్నిగారూ!"

"ఏమిటీ?" ప్రశ్నలో ఆశ్చర్యం తలమునకలుగా ధ్వనించింది.

"అత్తగారింటికి వచ్చాను. ఇంట్లో ఆయన తప్పా మరెవ్వరూ లేరు. రెండు మూడు నెలలు సంతోష కరంగానే గడిచిపోయాయి. నేనప్పటికి ఒళ్ళు తెలియకుండా వుండడానికి దుస్తులు అనుకునేదాన్ని! ఆయన గ్లేజు కాగితం లాంటి దుస్తులు తెచ్చి ధరించమంటారు. నేనెత్తుమడమల కాలిజోళ్ళు వేసుకోడం ఆయనకిష్టం! వాటిని వేసుకుంటే నేనెక్కడో ఒకచోట జారిపడడమే ఖాయం! ఆయన రెండు జడలతో సింగారించుకో మనేవారు, ఆ వేషంతో బయటికి రావడానికి నాకు చచ్చినంత పనయ్యేది! నాలుగైదు రోజులు అలా ఆయనవెంట షికార్లు తిరిగాక 'బాబూ, మీకో నమస్కారం! ఇంక నేనిలా బయటికి రాలేనని' చెప్పేశాను. ఆయన మండిపడ్డారు."

"బాగుందమ్మా బాగుంది. ఇదివరకటి కెప్పుడో నాతిని కోతిగా మార్చేసేవాడట మాయల మరాటీ! ఇప్పుడు మనుషులు కూడా అలాటి పనికి పూనుకుంటున్నారని నాకు తెలీదు."

"అంతటితో ఏమయింది పిన్నిగారూ! నాకెన్నోచిత్రవిచిత్రాలైన సంగతులు చెప్పేవారు. బొంబాయిలోనట, ఆడవాళ్ళెవరో నగ్నంగా నృత్యమే చేస్తారట! మచ్చుకు యింగ్లీషు సినిమాల్లో చూపిస్తాను, చూడమనేవారు. ఒకటి రెండు చిత్రాలను చూస్తూ చూస్తూ కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

"ఆయన నన్ను సొసైటీకే పనికిరావు పొమ్మనేశారు."

"ఇదిగాక ఆయనకు మరొక పిచ్చి వుండేది. నాటకాల పిచ్చి! మొదట నన్ను గూడా నాటకానికి తయారు చేయాలని చూశారు. సాధ్యం కాలేదు. సంసారం చేయడానికి తప్పా మరొకందుకు పనికి రాకపోవడమే నాపట్ల పెద్ద అపరాధమైపోయింది. అంతెందుకండీ పిన్నిగారూ! నలుగురైదుగురు స్నేహితుల మధ్య తన సిగరెట్టుకు నేను అగ్గిపుల్ల గీసి వెలిగించకపోవడం కూడా, సొసైటీకి నేను పనికిరానందుకు ఒక కారణమే!"

"చాలమ్మా చాలు. ఇంక చెప్పనక్కర్లేదు."

ఐతే ఆగే ధోరణిలో లేదు సులోచన. కానీ ఆమె ఆత్మకథకు ఆటంకంగా రంగంపైన ద్వితీయాంకం ప్రారంభమైంది.

తన బొమ్మలను ఎవరో కొంటామని చెప్పడం వల్ల పొరుగూరికి వెళ్ళాడు కథానాయకుడు. నాయకి అతడికోసం వేచి చూస్తోంది. సమయం రాత్రి పదిగంటల వేళ. మొదట ముచ్చటగా చిన్న విరహగీతిక. లత పరుపు మీద పడుకుంటుంది. లేచి కూచుంటుంది. ఓ బొమ్మల పత్రికను తీసి రెండు బొమ్మల్ని చూచి నేలపైకి గిరవాటెడుతుంది. ఆమెకు ముళ్ళపైన కూచున్నట్టుంది. ఏదో మంట ఆమెను కొంచెం కొంచెం గా కాల్చుకు తినేస్తోంది. చిరాకు, చెప్పరానంత చిరాకు. ఆమె గదినంతా ఓసారి కలయజూసింది. బొమ్మలు, బొమ్మలు- గోడలపై ఎక్కడ చూసినా బొమ్మలు. చీడలాంటి పాడు బొమ్మలు! ఆమె నాలుగింటిని చింపి ప్రోగులు పెట్టింది. రెండింటిని కాలితో రాచేసింది.

తలుపు మ్రోగింది!

తెరిచింది లత.

వచ్చినవాడు ప్రసాదరావు గాదు - అతని స్నేహితుడు శంకరం.

"ప్రసాదరావు వున్నాడు గదండీ!" అంటూ లోపలికి వచ్చాడు శంకరం.

"లేకపోతే కాసేపు కూచోగూడదటండీ!" అంది లత.

ఆమాత్రం ఆతిథ్యమర్యాద చాలు శంకరానికి! కూర్చుంటూ "ఒంటరిగా ఎలా వున్నాడీ?" అని సానుభూతి ప్రకటించాడు.

"ఏం చేయమంటారండీ, ఏం చేయమంటారు?"

తెల్లబోయాడు శంకరం, "అదేమిటండీ, అలా బాధపడుతున్నారు?" అన్నాడు. (న్యాయానికి ఎందుకలా తల్లడిల్లిపోతున్నారని అడగవలసింది)

లత శంకరాన్ని చూచింది. చూచిన చూపులో తీరని తమి విప్పారించింది.

"చిలకను పంజరంలో బంధించడం న్యాయమేనా శంకరం గారూ! కోయిల గొంతును త్రాటితో బిగించడం న్యాయమేనా శంకరం గారూ! అందాన్ని దోచుకోక, ఆనందానికి నోచుకోక, కడుపు కక్కుర్తితో వూళ్ళ వెంబడి తిరగడం కూడా ఒక బ్రతుకేనా శంకరం గారూ!"

అందులో శంకరం తప్పేమీ లేదు. ప్రేక్షకులు కూడా అలాగే భావించారు. ఎలాగ? ఇప్పుడు నిజంగా అపరాధం చేసినవాడు శంకరమే అయినట్టు; అందుచేతనే లత అతన్ని నిలదీసి సూటిగా ప్రశ్నిస్తున్నట్టు!

శంకరం హఠాత్తుగా లతను సమీపించాడు. ఆమె భుజం పైన చేయి వేశాడు.

"ఊరుకో లతా! నువ్వు బాధపడితే నేను చూడలేను. నువ్వు నవ్వాలి. నవ్వుతుంటే నిన్ను చూడాలి. కనీసం నా కోసం..."

"నిజంగానా శంకరం గారూ?"

"నిజంగా!" చేతిలో చేయివేశాడు శంకరం.

లత కిలారున నవ్వేసింది. "నా శంకరం! నా రాజా!" అంటూ అతడిపైకి వ్రాలిపోయింది.

తెర వెనుక పనిచేస్తున్న వాళ్ళ మెలకువ మెచ్చుకోదగ్గది! వాళ్ళు వెంటనే లైట్లు ఆర్పేశారు. కర్టెను దింపేశారు.

"నేను సొసైటీకి పనికి రాకపోయానా పిన్నిగారూ!"

ముసలావిడకు మతిపోతోంది. సందేహం లేదు. ఈ రెండు కథలూ మరి కొంతసేపు

యిలాగే కొనసాగితే ఆవిడకు మతిపోతుంది.

"ఆయన యింటికి రావడం తగ్గించేశారు. ప్రొద్దస్తమానం పేకాట. చీకటి పడితే సినిమాలు. అవిగాక నైట్‌క్లబ్బులు. ఆ క్లబ్బుల్ని గురించి వినరాని సంగతులెన్నో వున్నాయి. మీరు వినదలుచుకుంటే చెబుతాను..."

"వద్దమ్మా వద్దు!"

"తెల్లవారబోతుండగా ఆయన తూలుతూ యింటికి వచ్చేవారు. నోరు తెరిస్తే నాలుగు బారల దూరంలో వుండడానికి సాధ్యమయ్యేది కాదు. దుర్వాసన! అలాగే ప్రొద్దు తిరిగేదాకా మంచంపైన పడివుండి ఆ తర్వాత లేచి నీటుగా ముస్తాబై భోజనానికి నేరుగా హోటలుకే దారి తీసేవారు! ఇక నా గతి ఎవరితో చెప్పుకోను? చీర వుండదు. జాకెట్టుండదు. పిడికెడు మెతుకులు తిని పడుకుందామనుకుంటే కుండలో బియ్యముండదు. ఎంత జాలి కలిగిన వాళ్ళయితే మటుకు యిరుగు పొరుగు వాళ్ళెంతకాలమని సాయం చేస్తారు పిన్నిగారూ?"

ఈ కథకంటే నాటకం ప్రారంభమైతే, ఆ కథే నయమనిపించింది ముసలావిడకు!

ఆమె కోరికను గ్రహించినట్టుగా తెర పైకి లేచింది.

వెళ్ళిన పని యింకా పూర్తి కాలేదనీ, తిరిగి రావడానికి బహుశా వారం రోజులు పట్టవచ్చుననీ ఉత్తరం రాశాడు ప్రసాదరావు. రోగి కోరిన పథ్యాన్నే వైద్యుడు అనుగ్రహించినట్టయింది. లతకూ, శంకరానికీ రోజులు క్షణాల్లా దొర్లిపోతున్నాయి. తెర లేచిన పది పదిహేను నిముషాలకు బూచివాణ్ణి తలచుకుని జడుసుకున్న కుర్రాడిలా కలవరపడ్డాడు శంకరం.

"కొంపదీసి ప్రసాద్ వచ్చేస్తే మనమేం చేయాలి లతా?"

"వస్తే వస్తాడు. నీకేం శంకరం?" ఒక అపాంగావలోకనంతో అతడి భయాన్ని తుడిచేసింది లత.

అనుకున్నట్టు ప్రసాదరావు రానే వచ్చాడు. శంకరం బెంబేలు పడి పోతున్నాడు. లత కూడా కంగారు పడిపోతోంది.

కానీ ప్రసాదరావు తరహా అదో రకంగా వుంది. అనుమానించాలన్న ఆలోచనే రావడం లేదతనికి!

పైపెచ్చు అతడు శంకరం భుజం పైన చేయివేసి "నీవల్ల మా లతకు కాస్తా కాలక్షేపమై వుంటుంది శంకరం! థాంక్స్ ఫర్ యువర్ కైండ్‌నెస్!" అన్నాడు.

"నో మెన్షన్ ప్లీస్!" నూతిలో నుంచీ పలికినట్టుగా అన్నాడు శంకరం.

బొమ్మలు బాగా అమ్ముడు బోయాయేమో, ప్రసాదరావు చాలా వుత్సాహంగా వున్నాడు. ప్రయాణ విశేషాలను ఏకరువు పెడుతూ అతడు మంచం దాకా వచ్చాడు. తలగడను సర్దుకుంటూ కూచోబోయాడు. తలగడ క్రింద నుంచీ ఓ చేతిగుడ్డ బయటపడింది.

అది శంకరం చేతిగుడ్డ.

ప్రసాదరావు శంకరం కేసి అనుమానంగా చూచాడు.

గడగడా వణకిపోతున్నాడు శంకరం. అతడు కూర్చున్న చోటుకు ద్వారం చేరువలోనే వుంది. లేచి నిల్చున్నాడు. వెలుపలికి చూచాడు.

నాలుగడుగులు ముందుకు వేసి ద్వారాన్ని దాటుకోగలిగితే చాలు! కానీ ఏదో ఒక సాకు చెప్పాలి ..... ఏమని చెప్పడం? నోరు తెరిచాడు "కా ..... కా ..... కాస్తా తొందరపనుంది. మ.....

మ...... మళ్ళా వస్తాను." వాక్యాన్ని ముగించకుండానే శంకరం కాలికి బుద్ధి చెప్పేశాడు.

ప్రసాదరావు కళ్ళు విస్ఫులింగాల్లా మండిపోతున్నాయి. అతడు నుదురు చిట్లించాడు. పళ్ళు పటపట కొరికాడు. అమాంతంగా లతపైకి వచ్చేస్తున్నాడు.

"చెప్పు. ఏం జరిగింది? ఏమిటిది? ఈ చేతిగుడ్డ అక్కడి కెలా వచ్చింది? ఊఁ చెప్పు. లతా! నువ్వు చెప్పాలి. చెప్పవూ! ఎందుకు చెప్పవు?"

చేతుల్ని పైకెత్తి లత కంఠాన్ని నులిమేయబోతున్నాడు ప్రసాదరావు.

హాల్లో ఒక్క మనిషి గూడా వున్నట్టు లేదు. సూది క్రింద పడినప్పటికీ వినిపించేటంత నిశ్శబ్దం! మరుక్షణాన ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని ఓ గావుకేక!

అందుకు కారణం ప్రసాదరావు తలకు తగిలిన దారుణాఘాతం! లత చేతికి దొరికిన ముక్కాలిపీటను అతడి పైకి విసిరింది.

రక్తపు వెల్లువలో పడిపోయాడు ప్రసాదరావు. లత బాణంలా చీకట్లోకి దూసుకపోయింది.

"అబ్బాయ్! రెండు కాఫీలు పట్టుకురా" అంది ప్రేక్షకలోకంలో నుంచీ సులోచన.

"అబ్బే, నా కెందుకులే అమ్మాయ్! నువ్వు తీసుకోగూడదూ!" అని వారించింది ముసలావిడ.

"ఫరవాలేదు, తీసుకోండి పిన్నిగారూ! మీకు మాత్రం తలనొప్పిగా లేదేమిటి?"

"ఎందుకు లేదమ్మా! ఉంది. ఐనా ఎంత పని చేసిందమ్మా రాక్షసి! తల చితికి పోయిందేమో పాపం!"

"తల చితికిపోతే 'రిపేరు' చేయించుకోవచ్చు! జీవితమే చితికిపోతే?"

"అదేమిటమ్మా! ఏం జరిగింది?"

"ఇక్కడ ఆవిడ వెళ్ళిపోవడం చూచారు గదూ! అక్కడ ఆయనా యిల్లు విడిచి యిలాగే పరారై పోయారు!"

"అలాగా?"

"ఓపినన్ని అప్పులు చేసేశారు. వాటిని తీర్చే వుపాయం లేదు. పొలం పుట్రా, నగా నట్రా అప్పటికే ఖాళీ అయిపోయాయి; జల్సాలకూ, ఖుషీలకూ! చేత ఏగానీలేదు. ఆలోచించి చూచారు. అయిన కాడికి కాపురముంటున్న యింటిని తెగనమ్మేసి వెళ్ళిపోయారు. ఇల్లు పరులపాలై పోయిన సంగతి తీరా కొనుక్కున్నవారు ఖాళీ చేయమని కబురుపెట్టిన తర్వాత తెలిసింది!"

"నిలువ నీడ కూడా లేకపోయిందన్న మాట?"

"అలా జరగవలసిందే మరి! కానీ జన్మకల్లా శివరాత్రిగా అక్కడ నాకు అదృష్టం కాస్తా కలసివచ్చింది. మా తాత గారొక రుండేవారు. మా అమ్మకు నాన్నగారన్నమాట. ఈ సంగతి తెలిసి ఆయన పడుతూ, లేస్తూ వచ్చారు. నన్ను చూచి అంగలార్చారు. నాకు మేనమామలు ముగ్గురున్నారు. అందరు చేస్తున్నవీ పెద్ద వుద్యోగాలే! వాళ్ళని బ్రతిమాలుకుని తాతగారు ఓ వెయ్యి రూపాయలు తెచ్చి యింటిని విడిపించారు. నా పేరిట రిజిస్టరు చేయించారు...."

కుర్రాడు కాఫీ తెచ్చాడు. సులోచన త్వరత్వరగా కప్పు ఖాళీ చేసింది. బాగా చల్లబడిన తర్వాతగానీ చవిచూసే అలవాటు లేదేమో, ముసలావిడ యిక్కడ కాఫీ ముగించడానికీ, అక్కడ తెరపైకి లేవడానికీ సరిపోయింది.

పరిస్థితులు ప్రసాదరావుని యించుమించు పిచ్చివాణ్ణిగా మార్చేశాయి. తెర లేచేసరికి అతడు కుర్చీలో చేరగిలబడి టేబిల్ పైకి కాళ్ళు బారగిలచాపి పైకప్పుకేసి శూన్యంగా చూస్తున్నాడు. ఏం

తోచిందోగానీ హఠాత్తు ఠాత్తుగా లేచాడు. చిటె ంగులో అద్ది గోడకు వ్రేలాడుతున్న కాగితంపైన
నాలుగైదు వంకర గీత గీతలు గీచాడు. ఆ గీతలు ఓ మనిషి ముఖంగా రూపొందాయి. బొమ్మను
పరిశీలనగా చూచాడు డు ప్రసాదరావు. "ఎవడివో నాన్నా నువ్వు? ఎవడివో గానీ నువ్వు నాలాటి
పిచ్చివాడివిగానే వున్నావు న్నావు! రైర్రో, జోడు బాగా కలిసింది. నాకు నువ్వు, నీకు నేను .... నీకూ నీ
వారు లేరు, నాకూ నా నా వారు లేరు...." పాట ప్రారంభించేశాడు. కానీ పాట పల్లవితోనే ఆగిపోయింది.
ప్రసాదరావు వికటంగా నగా నవ్వసాగాడు. నవ్వుతూ నవ్వుతూ వుండగానే అతడి ముఖం సీరియస్‌గా
మారిపోయింది. "ఏమి "ఏమిట్రా నాన్నా నీ బాధ? తెలిసిందిలే! నీ పెళ్ళాం గూడా లేచి వెళ్ళిపోయింది
గదా! ..... వాడెవడో చె చెప్పు. వాణ్ణి నుగ్గునూచం చేస్తాను. కండలు కండలుగా నరికి కాకులకు
వేస్తాను. నమిలి మి మింగేస్తాను...." మళ్ళీ కొన్ని క్షణాలు మౌనం. ఈసారి రౌద్రం కరుణగా
పరిణమించింది. "ఎం ఎందుకేడుస్తావు బాబూ! వద్దు. ఏడ్చిమాత్రం లాభమేముంది చెప్పు? నేను నీలాగే
ఏడ్చీ ఏడ్చీ మానేశాను...."

తలుపు తెరచు రచుకుంది. ప్రసాదరావును పరామర్శించి పోవడానికి ఓ మిత్రుడు వచ్చాడు.
సంభాషణ ద్వారా వ్యక్త క్తమైంది - అతడి పేరు శేఖరం. లత ఎలాటి దుర్గతి పాలయిందో చెప్పడానికి
వచ్చాడు. శంకరం ఆ ఆమెను మోసగించి పారిపోయాడట! మద్రాసు లాంటి మహానగరంలో ఆమె
దిక్కు లేనిదై పోయింద దట! ఎలాగోలాగ రోజులు వెళ్ళదీయడం వల్ల ఆరోగ్యం బాగా పాడైపోయిందట!
ఇప్పుడు క్షయతో అవస్థ వస్థపడుతోందిట!

"క్షయ! నా ల లతకు క్షయ! శేఖరం, నా లతకేనా క్షయ?" అంటూ ప్రసాదరావు శేఖరం
భుజాలు పట్టుకుని వూ నూపేశాడు.

"వీల్లేదు. నా నా లతకు క్షయ రావడానికి వీల్లేదు" అని పై కప్పు ఎగిరిపోయేలా ఘోషించాడు.

ఇక్కడ శేఖరం ం ప్రసాదరావుకు కాస్త హితబోధ చేశాడు. మానవుడికి ఆత్మ సంయమనం
ఎంతో అవసరమనీ, మన మనసు వెళ్ళినట్టల్లా వెళ్ళడం, నోటికి వచ్చినట్టల్లా మాట్లాడ్డం వినాశానికి హేతువనీ
విడమరచి చెప్పాడు.

"అలాగే శేఖరం రం! నువ్వు చెప్పినట్లే వింటాను శేఖరం! నువ్వు నాకు స్నేహితుడివి. దయతలచి
నాకో వెయ్యి రూపాయల లు అప్పివ్వవూ? నీ డబ్బు నీకు పువ్వుల్లో పెట్టి యిచ్చుకుంటాను. ఎలాగైనా
ఋణం తీర్చుకుంటాను ను!" అని దీనంగా అర్థించాడు ప్రసాదరావు.

శేఖరం తేలిగ్గా నవ్వేశాడు. "బాగుందిరా బాబూ, బాగుంది! చూచి వెళ్దామని వస్తే నన్ను
వెయ్యి రూపాయలు అప్పు అడుగుతావూ? అందులోనూ నన్ను! రోజుకు రెండుం బావలా తెచ్చుకుంటున్న
ఆర్డినరీ గుమాస్తాను! ఒరేయ్ ప్రసాద్! ఎప్పుడు తిన్నావోగానీ నీ ముఖం వాడిపోయింది! ఇదుగో.
ఈ అర్ధరూపాయి తీసు కో! వెళ్ళి కడుపునిండా భోంచెయ్. వచ్చి మంచం పైన కదలకుండా
పడుకో...."

తిరిగి చూడకుం డా వెళ్ళిపోయాడు శేఖరం.

ప్రసాద్ జుట్టు పీక్కున్నాడు. అప్పటికే చిరిగి వున్న చొక్కాను మరింత చీలికలు వాలికలుగా
చింపేసుకున్నాడు. "క్షయ, క్షయ - డబ్బు, డబ్బు" అని ఆక్రోశించాడు.

కథలో మలుపు తేవడానికి అప్పుడొక పోస్టుమేన్ రంగంపైకి అవతరించాడు.
వచ్చింది జాబు గాదు - టెలిగ్రాం.
చేవ్రాలు చేసి చి చించి చూచాడు ప్రసాదరావు. ఇదివరకెప్పుడో ప్రపంచ చిత్రాల పోటీకి పంపిన

తన బొమ్మకు ఫస్ట్ ప్రయిజ్ - వెయ్యి, డాలర్లు!

ప్రసాదరావు కళ్ళల్లో ఆనందం వెల్లివిరిసింది. అతడు పోస్టుమేన్ దగ్గరికి ఎగిరిదూకాడు. అతణ్ణి కౌగిలించుకున్నాడు. ప్రయిజ్, ఫస్టు ప్రయిజ్ అంటూ గాఢ పరిష్వంగంలో అతణ్ణి వుక్కిరి బిక్కిరి చేశాడు.

ఆ బాహుబంధనంలోనుంచీ బయటపడేసరికి పోస్టుమేన్ పని తల ప్రాణం తోకకు వచ్చింది.

ప్రసాదరావు గది మధ్యకు పరతెంచాడు. లత ఫోటోను స్టాండులో నుంచీ తీశాడు. రొమ్ముకు హత్తుకున్నాడు. "లతా! నువ్వు క్షయతో బాధ పడడానికి వీల్లేదు. వస్తున్నా. ఇదిగో వస్తున్నా" అంటూ బయటికి పరుగుదీశాడు.

"ఐనా యిలాటి వాళ్ళు గూడా వుంటారంటావా అమ్మాయ్?" ముక్కు మీద వ్రేలేసుకుని విస్మయంతోఅడిగింది ముసలావిడ.

"ఏమిటో మరి! పెద్దవారు, మీరే చెప్పాలి" అంది సులోచన.

"ఐతే యితగాడు మళ్ళీ ఆవిడను చేరదీస్తాడన్న మాట?"

"చేరదీయడమేనా! ఎలాగూ ప్రయిజొచ్చిందిగా! చేతిలో కావలసినంత డబ్బుంది. మందులకు వెదజల్లుతాడు. డాక్టర్లను తీసుకొస్తాడు. అహరహమూ శుశ్రూష చేస్తాడు. ఆవిడ ఆరోగ్యం చక్కబడుతుంది. ఇద్దరూ హాయిగా వుంటారు...." ఎవరో గానీ వెనుకనుంచీ యిలా ఊహాగానంతో కథను ముగించారు.

ముసలావిడకీముగింపు కంటకప్రాయంగా వుంది. తన చిన్నతనం లోనూ పార్శీ నాటకాలనీ, బాల బ్రహ్మానంద సమాజమనీ, సరస్వతీ నాటకసభ అనీ, ఎవరెవరో వచ్చి నాటకాలు ప్రదర్శించేవారు - సత్యహరిశ్చంద్ర, చిత్ర నళీయం, భక్త ప్రహ్లాదలాంటి నాటకాలు. వాటిల్లో ఎక్కడైనా సచ్ఛీలం కలిగిన ఆడదాన్ని అనుమానించి అడవులకు పంపి, నిజం తెలియగానే పశ్చాత్తాపపడి చేరదీయడం కద్దు! అంతేగానీ చెడిపోయిన ఆడదాన్ని చేరదీసే అవలక్షణం తనింతకు మునుపెన్నడూ కనీ వినీ ఎరుగని విషయం! కాలం చెడిపోయింది అటుంటారు కొందరు, యిందుకే కాబోలు!

ఊహాగానం సలిపింది ఎవరోగానీ వాళ్ళు నాటక కథల పోకడలను కొంతవరకూ ఆకళించుకున్న వారుగానే వున్నారు. కథ చాలవరకూ అలాగే పరిణమించింది. లేదంటే చిట్టచివర కించిత్తు మార్పు. డాక్టర్లు చెబుతూ వచ్చిన గుండె దిటవుమాటలు, మందులవల్ల చేకూరుతూ వచ్చిన రోగనిరోధక శక్తి, టానిక్కుల వల్ల లభ్యమైన జవసత్వాలు యివన్నీ ఒక ఎత్తుకాగా, కళ్ళకు ఒత్తులు వేసుకుని ప్రసాదరావు చేసిన పరిచర్యే ఒక ఎత్తుగా లత ఆరోగ్యం కుదుటపడింది. కానీ అలాగని ఆ యింట్లో రోగశయ్యను తీసివెయ్యడానికి మాత్రం వీల్లేకపోయింది. ప్రసాదరావు ఖణిల్లు ఖణిల్లుమని దగ్గుతూ ఆ పరుపుపైన్నే పడుకున్నాడు.

ఉపకారికి వుపకారం చేయడంలో విడ్డూర మేముంది? లత తన సాయశక్తులా ప్రయత్నించింది. ఐదు నిమిషాల కొకసారి డాక్టర్లకు ఫోను చేసింది. ఐన మందులన్నింటితోనూ ప్రసాదరావు ఉదరభాండాన్ని నింపివేసింది. అతడి శరీరంపైన యింజెక్షనుసూది మోపని తావులేకపోయింది - కానీ యింతచేసీ లాభంలేక పోయింది!

ఎక్కడ కూర్చుందో గానీ మృత్యుదేవత తన చేతుల్ని చాచి ప్రసాదరావుని పిలుస్తోంది.

పంచప్రాణాలనూ కళ్ళల్లో నిలుపుకుని, రొమ్మునొప్పికి చుట్టలు చుట్టుకపోతూ మంచంపైన పడివున్నాడు ప్రసాదరావు.

సమయం అర్ధరాత్రి. బయట గాలి వాన విజృంభిస్తోంది. ప్రసాదరావు తల దగ్గర కొడిగట్టిన ఆముదపు దీప మొకటి మినుకు మినకు మంటోంది.

"మాట్లాడరేమండీ! అలా వెర్రిచూపులు చూస్తున్నా రేమండీ!" అంది లత.

ప్రసాదరావు ప్రయత్నించి మంచం మీద నిలువునా పడుకున్నాడు. ఆమె ముంగురుల్ని సవరిస్తూ "బ్యాంకులో యింకా అయిదువేల రూపాయలున్నాయి లతా! నువ్వు సుఖంగా బ్రతకాలి. ఇదే నా ఆఖరు కోరిక" అన్నాడు.

"అయ్యయ్యో, అలాగంటున్నా రేమండీ! నన్ను దిక్కులేని దాన్నిగా చేసి వెళ్తారటండీ!" అంటూ ప్రసాదరావు పైనబడి రోదించింది లత.

"లతా!"

సజల నయనాలతో భర్తవైపు చూచింది.

"నా మాట వినవూ?"

"చెప్పండి."

"కళ్ళు తుడుచుకో."

తుడుచుకుంది.

"నేనానందంగా కళ్ళు మూసుకోవాలి!"

" ....................................... "

"అందుకోసం ....... నువ్వొక పాట పాడాలి!"

"నేనా! పాట పాడ్డమా! పాడమంటారా!" ఉన్మాదం తెరలు తెరలుగా వచ్చి లతలోని చైతన్యాన్ని ముట్టడిస్తోంది.

ఆమె పాడసాగింది.

"ఇదంతా ఒక గాథ!
మానవ జీవిత విషాద గాథ! ............. ఇదంతా .......
ఆశ నిరాశై, కలలు కల్లలై
బీటలువారిన పెనుబీడై
బ్రతుకా! కాదిది పెను సహారా!
లేదా దీనికి మేరా? ..... ఇదంతా ...."

పాట చివరిదాకా కొనసాగింది. విసురుగా వీచిన గాలి తాకిడికి కొడి గట్టిన దీపం ఆరిపోయింది. తెర బరువుగా క్రిందికి వ్రాలిపోయింది.

"ఇదీ నాటకం! ఇదీ నటన! ఏం చేసిందిరా హీరోయిన్! మార్వెలెస్, ట్రెమండస్!"

"ఏడ్చావులే, నోరు మూసుకో! ఫస్టు ప్రయిజ్ హీరోది! బెట్ కడ్తాను కావలిస్తే!"

"అదేమిటే చిట్టీ తల్లీ! ఏడుస్తున్నావా? వెర్రిబాగుల్దానా, యిదంతా నాటకం! నాటకమంటే ఏమిటి, బూటకమే గదూ!"

"ఏం నాటకమోనమ్మా పాడూ! ఈ రాత్రికిక నిద్రపట్టేట్టు లేదు - పీడ!"

"నిజం చెబుతున్నానురా బాబూ! వాడలా హృదయ విదారకంగా దగ్గుతుంటే నా గుండె కంపించి పోయింది. స్టేజిపైన వున్నంతసేపూ వాడు పాత్రలో జీవించాడురా! అందుచేతనే రక్తి గట్టింది నాటకం!"

"బాగుంది. చాలా బాగుంది. త్యాగమంటే అదీ త్యాగం!"

అర్ధరాత్రి దాటింది. పుబ్బ కార్తి చినుకులు రోజుకొకటి రెండుసార్లు వచ్చి పోతుండడం వల్ల వాతావరణం తడితడిగా వుంది. మెల్ల మెల్లగా కాళ్ళీడ్చుకుని గృహోన్ముఖులౌతున్నారు ప్రేక్షకులు.

"అసలీనాటకానికి వచ్చేదాన్నే కాదమ్మాయ్! ఎవరో మా అబ్బాయికి రెండు టికెట్లు అంటగట్టారట! వాడు ఆఫీసులో పనివుందని వాటిని పెళ్ళాం ముఖాన పారేసి వెళ్ళిపోయాడు. ఆవిడ పిల్లలకోడి. 'మీరు వెళ్ళిరండి అత్తయ్యా!' అంది. ప్రక్కింటి కుర్రాడిని తోడు దీసుకొచ్చాను. వాడటు వైపున ఎక్కడో కూచున్నాడు. ఏడీ, ఎంతకూ కనిపించడే వాడు?"

"మనం వెళ్తూ వుందాం రండి పిన్నిగారూ! త్రోవలో కలుసుకుంటాడు" అంది సులోచన.

ఇద్దరూ నడువ సాగారు.

థియేటరు దగ్గర లాకుల్లోనుంచీ వెలుపలికి దూకిన నీళ్ళలా బయటబడిన జనప్రవాహం రానూరానూ పిల్ల కాలువలా పలుచబడి పోతోంది.

"మీ రెందాకా వెళ్ళాలండీ పిన్నిగారూ?"

"రామస్వామి గుడి దాటుకుని జండామాను వీధిలోకి తిరిగాలి. ఏటిగట్టున మా యిల్లు....."

"ఐతే యికనేం! కాస్త అడుగు ముందుకు సాచి వేయండి. నేనూ ఆ వీధిలో కట్టెల డిపోదాకా వస్తాను. ఆ డిపోకు ఎదురుగానే....."

వాక్యం మధ్యలో ఆగిపోయింది. సులోచన ఒకటి రెండుసార్లు పొడిపొడిగా దగ్గింది.

మళ్ళీ నాలుగడుగులు ముందుకు వేశారు. ఈసారి దగ్గు మరీ గొంతుకను పెకలించుకుని ఆ శుష్క శరీరాన్ని వూగించి వేస్తూ వచ్చింది. సులోచన వంగిపోయింది. వంగి మెలికలు తిరిగింది. కాస్త ఆధారంగా వుండడానికి ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని నిల్చుంది.

"అదేమిటమ్మాయ్, నువ్వూ దగ్గుతున్నావు?" అంది ముసలావిడ. తీరా అన్న తర్వాత నాలుక కొరుక్కుంది.

సులోచన ఫక్కున నవ్వింది.

"మీరిందాకా చూచింది అభినయాన్నండీ పిన్నిగారూ! నేను అనుభవిస్తున్నదాన్ని!"

"దేన్ని?"

"దాన్నే! క్షయను."

ముసలావిడ మాట్లాడలేదు. మాట్లాడలేకపోయింది.

జండామాను వీధి వచ్చింది.

"అసలే ఆదినుంచీ నా ఆరోగ్యం అంతంత మాత్రం. ఈ మిషను పని నేర్చుకున్నప్పటి నుంచీ మరీ విషమించింది. సాయంత్రం మిషను పైన్నుంచీ లేచేసరికి కొలిమిలో కాలిన యినుప ముక్కలా ఒళ్ళు ఒళ్ళంతా వేడెక్కి పోతుంది. అప్పటికీ ఏవేవో మందులు గూడా తీసుకుం టున్నాను....."

ఓదార్చడానికి ముసలావిడకు మాటలేవీ స్ఫురించడం లేదు.

కట్టెల డిపో గూడా వచ్చింది.

"ఇదేనా అమ్మాయ్ నీ యిల్లు?" ఓ చిన్న పెంకుటింటిని చూస్తూ అడిగింది ముసలావిడ.

"అవునండీ పిన్నిగారూ! ఇల్లే గాదు, నా లోకమే యిది!"

ముసలావిడ ముందుకు చూచింది. కుర్రాడెక్కడా కనిపించడం లేదు. ఒకవేళ వెనుకనే నిల్చిపోయి తనకోసం వెదకుతున్నాడేమో!

"లోపలికి వచ్చి నీ సంసారాన్నొకసారి చూడొచ్చునా అమ్మాయ్?"

"రండి పిన్నిగారూ! మీరు రావాలే గానీ అభ్యంతరమా!"

ముసలావిడ లోపలికి వెళ్లింది. నిరంతరంగా చింతలూ వంతలూ, కష్టాలూ నష్టాలూ పారాడే యిల్లిలాగే వుంటుంది కాబోలు ననుకుంది. స్టూలు పైన కూర్చుంది. చీగటీగలు ఝుమ్మని రొద చేస్తున్నాయి. కిటికీలు లేకపోవడం వల్ల బయట చలిగావున్నా లోపల ఉక్కబోస్తోంది. గుహలాంటి ఈ చీకటింట్లో ఒక మనిషి రోజులు, వారాలు, సంవత్సరాలు ఎలా దొర్లించగలుగుతోంది?

ముసలావిడ లేచి నిల్చుంది. నిల్చోగానే ఆమెకో విషయం స్ఫురించింది. తను యింటి లోపలికి వచ్చినప్పటి నుంచీ మౌనంగానే వుండిపోయింది. వెళ్ళిపోవడానికి ముందైనా ఒకటి రెండు మాటలు మాట్లాడలేక పోతే బాగుండదు.

"ఇది వంట గదన్నమాట! ఇది పెరటికి దారిగదూ? ఇదేనా మిషను? వెళ్ళాలమ్మాయ్! ఆలస్యమైతే మా వాళ్ళు కంగారుపడతారు...."

ముసలావిడ ద్వారంవైపు మళ్ళింది. మళ్ళుతూవుండంగా ద్వారానికి పైన గోడకు వ్రేలాడుతున్న ఛాయాచిత్రం ఒకటి ఆమెకు కనిపించింది.

పటాన్ని ముసలావిడ చేతికి తీసుకుంది. ఓ క్షణం చూచింది. రెండు క్షణాలు చూచింది. అప్పటికీ తృప్తి కలుగలేదేమో, మరుక్షణాన చిత్రాన్ని తీసుకుని దీపం దగ్గరికే వచ్చేసింది.

"అది పెళ్ళయిన క్రొత్తలో యిద్దరమూ కలిసి తీయించుకున్న ఫోటోనండీ పిన్నిగారూ!"

"అవుననుకో! ఈ ముఖాన్ని బాగా చూసిన జ్ఞాపకముంది. ఎప్పుడో కాదు ..... యిప్పుడే! ఎక్కడో కాదు - ఈ నాటకంలోనే!"

సులోచన ముఖాన్ని గోడవైపుకు త్రిప్పుకుంటూ "ఇంక నలభై యేళ్ళు బ్రతికినా మీకు కళ్ళజోడుతో అవసర ముండదండీ పిన్నిగారూ!" అంది.

"అది కాదమ్మాయ్! అతడేనా యితడు? నాటకంలో దానికోసం చనిపోయినవాడు!"

"మరి అది నాటకం కదండీ!"

"ఐతే యిదేమిటి?"

"ఇది జగన్నాటకం!"

*(ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధం, 1954)*